క్లుప్తంగా

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలో దసరా శరనవ రాత్రుల మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారు రోజుకో దివ్యరూప అలంకారాలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారి శాలలో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం వివిధ అలంకారాలలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించనున్నామని తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని శ్రీఅంకాలమ్మ ఆలయం, శ్రీవేంకటరమణుడి ఆలయం, మార్కెట్ సాయిబాబా ఆలయాలతోపాటు బ్రాహ్మణపల్లె గ్రామంలో వెలసిన మాలే గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

జమ్మలమడుగు రూరల్ : వాహనదారులు తమ వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలో వాహనాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు



మహిషాసురమర్దిని నాటక ప్రదర్శనలో విద్యార్థులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ దసరా పండుగలో దాగి ఉన్న ఆధ్యాత్మిక, సాంప్రదాయ విలువలను విద్యార్థులు పాటించాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

పెండ్లిమర్రి : గ్రామాలల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ అన్నారు. శనివారం పెండ్లిమర్రి గ్రామంలో పర్యటించి మాట్లాడారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైందని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రతి రోజు చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పండుగ పూట కూడా పస్తులేనా..?



చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న పారిశద్ధ్య కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

వేంపల్లె : గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో దసరా పండగపూట పస్తులు ఉండాల్సిందేనని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సి.బాదుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, పంచాయతీ యూనియన్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

జమ్మలమడుగు : ఎస్సీ వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలోనే చట్టబద్దత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేసి అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎర్రగుంట్ల : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ శేషఫణి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ–2025 కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలను నాటారు.

కుండపోత వర్షం.. దెబ్బతిన్న పంటలు, రహదారులు



జమ్మలమడుగు : రామిరెడ్డిపల్లె -చిన్నపసుపల గ్రామాల వద్ద నీట మునిగిన పంట



జమ్మలమడుగు-పెద్దపసుపల రహదారిలో రోడ్డుకు అడ్డంగా వచ్చిన ట్యాంకర్



ఎర్రగుంట్లలో నీటమునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్

జమ్మలమడుగు : నియోజకవర్గంలో భారీ వర్షాలు కురవడంతో పంట నష్టంతో పాటు రోడ్లు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో పంటలు మునిగిపోయి రైతులకు కొలుకోలేని దెబ్బ తగిలింది. ఒక్క పెద్దముడియం మండలంలోనే వరి, మిరప, కంది మినుము దాదాపు 1000 ఎకరాల్లో పంట దెబ్బతినిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పెద్దముడియం మండలంలోని గుల్లకుంట-మెడిదిన్నె రహదారి కోతకు గురై పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపసుపల-ఎన్.కొట్టాలపల్లె రహదారిలో వంకల్లో నీరు పారడంతో సగం రోడ్డు పైగా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగింది. చిన్నపసుపల-ఎస్.ఉప్పలపాడు గ్రామాల మధ్య రహదారి కోతకు గురి కావడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జమ్మలమడుగు–పెద్దపసుపల రహదారిలో వర్షం దెబ్బకు ట్యాంకర్లు కొట్టకువచ్చి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి.

గ్రామాలలోనికి వర్షం నీరు

పెద్దముడియం మండలంలో 12 సెంటీమీటర్లు, జమ్మలమడుగులో 9.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకావడంతో వంకలు పొంగి పొర్లాయి. వంకలు నీరు గ్రామాలలోకి వచ్చిచేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేవగుడి ఎస్సీ కాలనీలో వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి గ్రామంలో పర్యటించారు. రామిరెడ్డిపల్లెలో చుట్టూ వర్షపునీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. పెద్దముడియం మండలం గుల్లకుంట గ్రామంలో వర్షపునీరు వచ్చి చేరింది.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలం, పట్టణ పరిధిలలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైయ్యాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. వైకోడూరు వంక ఉధృతంగా ప్రవహించడంతో ఎర్రగుంట్ల నుంచి వెంపల్లెకు వేళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. చిలంకూరు, వలసపల్లె, తిప్పలూరు, సున్నపురాళ్లపల్లి, మాలెపాడు వంకలన్నీ ఉధృతంగా ప్రవహించాయి. పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లోని లోతట్టు ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. ప్రధాన విధులు నీటితో నిండిపోయాయి. తహసీల్దార్ శోభన్‌బాబు, కమిషనర్ శేషఫణిలు పట్టణంలో నిలిచిన నీటిని పంపింగ్ చేయించారు. అలాగే వేంపల్లి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ నీట మునిగింది. విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈ కార్యాలయాల ఆవరణం నీటితో నిండిపోయింది.

వేంపల్లెలో..

వేంపల్లె : మండల వ్యాప్తంగా మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరి, తదితర పంట పొలాలు దెబ్బతిన్నాయి. కుమ్మరాం పల్లె, ఇడుపులపాయ, అలిరెడ్డిపల్లె, వేంపల్లె తదితర గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. శనివారం పులివెందుల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శివశంకర్ రెడ్డిలు సందర్శించి స్థానిక రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరి, బెండ, వంగ తదితర పంటల వివరాలను ప్రాథమికంగా సేకరించి ఉన్నతాధికారులకు పంపించి తగిన న్యాయం చేస్తామన్నారు.



జమ్మలమడుగు : తెగిపోయిన గుల్లకుంట-మెడిదిన్నె రహదారి



జమ్మలమడుగు : రామిరెడ్డిపల్లెను చుట్టుముట్టిన వర్షపునీరు



జమ్మలమడుగు : కోతకు గురైన ఉప్పలపాడు-చిన్నపసుపల రహదారి



వేంపల్లె : వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ



ఎర్రగుంట్ల : విద్యుత్ శాఖ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు

రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పులివెందుల టౌన్ : ప్రభుత్వం రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించేలా చూడాలని రెడ్డి డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ఆర్‌సీడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్వోత్తమరెడ్డిలు ఆర్డీఓ చిన్నయ్యకు శనివారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇప్పటివరకు ప్రభుత్వాలు ప్రత్యేకంగా రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని, ఇతర కులాలకు ఇప్పటికే కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులను కూడా కేటాయించారన్నారు. రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించి కార్పొరేషన్‌కు కనీసం రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీడీఎస్ రాష్ట్ర కార్యదర్శి రఘురామిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగపు కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



ఆర్టీపీపీలో రెండు రోజు దీక్షలో పాల్గొన్న జేఏసీ ఉద్యోగ కార్మికులు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో ఏపీఎస్పీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో జమాల్ బాషా, విద్యానందరెడ్డి, నాగయ్య, సుబ్బరాయుడు, సుబ్బరాజు, మనోహర్, నడిపిబాబు శివన్నలు కూర్చోన్నారు. ఈ దీక్షలకు జేఏసీ నాయకులు చైర్మన్ కృష్ణయ్య, వేణుగోపాలరావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొని మద్దతు తెలిపారు.

సిటీమాల్‌కు నిధులు ఇవ్వలేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : పట్టణంలో నిర్మాణంలో ఉన్న సిటీ మాల్‌కు కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో పులివెందుల టీడీపీ నాయకులు ఉండటం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకులు అంబకపల్లె నారాయణస్వామి, మున్సిపల్ కో ఆప్షన్ చంద్రమౌళిలు తెలిపారు. శనివారం పులివెందులలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులివెందుల నడిబొడ్డున శ్రీ వేంకటేశ్వరస్వామి సాక్షిగా టీడీపీ అధికారంలోకి వస్తే పాడాను కొనసాగిస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిన చంద్రబాబును రాజీనామా చేయమని పులివెందుల టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తే బాగుంటుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పులివెందుల అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఇవ్వదని, టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పకుండా నిధులు తెచ్చే మార్గం ఆలోచిస్తే బాగుంటుందన్నారు. సిటీ మాల్ నిర్మిస్తున్న కేసిపి ఇన్ఫ్రా కంపెనీకి రూ.10 కోట్ల బిల్లు బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తూ టీడీపీ నాయకులు లేనిపోని అవాస్తవాలు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి నారాయణ పులివెందుల మోడల్ టౌన్ అధికారులను రెండుమార్లు పిలిపించుకుని నిధులు ఇవ్వకుండా, చంద్రబాబు పులివెందులకు నిధులు ఇవ్వొద్దన్నారంటూ పులివెందులను అవమానించి ఖాళీ చేతులతో వెనక్కు పంపిన ఘనత మీ టీడీపీ నాయకులదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగపు నియోజకవర్గ కన్వీనర్ కార్తీక్, సోషియల్ మీడియా కన్వీనర్ జహీర్‌లు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులు జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కమలాపురం : పట్టణంలోని అమ్మవారు శాలలో వెలసిన శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సావాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, కోశాధికారి మాలేపాటి మల్లికార్జున తెలిపారు. శనివారం స్థానిక అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన పుస్తకాలను వారు విడుదల చేశారు. 12 రోజుల పాటు జరిగే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు మహిళలు, మహిళా మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఒక్కో రోజు అమ్మవారు ఒక్కో అలంకారంలో దర్శనమిస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

ప్రైవేటీకరణ ఆపాలి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, సీపీఎం నాయకులు గఫూర్‌లు తెలిపారు. పీపీపీ విధానంతో కారు చౌకగా వైద్య, విద్యను బజారులో సరుకుల్లాగా అమ్మడం అన్యాయమన్నారు. ప్రైవేటీకరణ చేయడంవల్ల ప్రజల నుంచి ఫీజులు రూపంలో, పన్నుల పేరుతో రకరకాలపేర్లతో వసూలు చేసే అవకాశం ఉందన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐలో చదువుకున్న విద్యార్థిని, విద్యార్థులకు కోర్సులు పూర్తి కాగా నే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కాలేజి ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జమ్మలమడుగు, మైలవరం ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 10వ తరగతి ఫెయిల్, ఉత్తీర్ణులైన వారు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఫొటోలు ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐటీలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు జమ్మలమడుగు, మైలవరం ఐటీఐలలో సంప్రదించాలన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కొండాపురం : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం ఫిర్యాదు రహిత గ్రామం కావడంతో చిన్నపల్లెను అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తామని డాక్టర్ సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్‌లు తెలిపారు. శనివారం చిన్నపల్లెను వారు దత్తతకు తీసుకుని అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో న్యాయ సలహాలు, మౌలికవసతులు, ప్రభుత్వ పథకాలకు అర్హులై అందనిచో న్యాయ సేవాధికారి సంస్థను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.భార్గవి, బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ నారాయణరెడ్డి, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సీఐ రాజా, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీఓ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విలువ జోడింపుపై శిక్షణ



ఇంక్యుబేషన్ సెంటర్‌లో యంత్రాల పనితీరును వివరిస్తున్న అధ్యాపకులు నజ్మా

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో పులివెందుల ఐ.ఐ.పి.యం, బెంగళూరు, ఫ్రెండ్స్ ఆఫ్ ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ సొసైటీ సంయుక్తంగా శనివారం ‘చిరుధాన్యాల విలువ జోడింపు, మార్కెటింగ్, బ్రాండింగ్’ అనే అంశం మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ పాల్గొని ఇలాంటి శిక్షణ కార్యక్రమాలకు రైతులు హాజరు కావడం వల్ల పండ్లు, చిరుధ్యానాల ప్రాసెసింగ్ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం కళాశాలలో ఉన్న పండ్లు నుంచి జ్యూస్ బాటిలింగ్ ఆటోమేటిక్ యంత్రాలు, చిరుధాన్యాల శుభ్రపరిచే యంత్రాలు, చిరుధాన్యాల నుంచి రవ్వ, పిండి చేసే యంత్రాలను ఉపయోగించి ఆహార పదార్థాలు తయారు చేసే పక్రియలో రైతులు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్ కళాశాలలో ఉన్న లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్ లో ఉన్న యంత్రాల పనితీరును వివరిస్తూ సాంకేతిక సమాచారాన్ని రైతులకు అందించారు. ఐ.ఐ.పి.యం. బెంగళూరుకు చెందిన డాక్టర్ నబీ రసూల్ చిరుధాన్యాల మార్కెటింగ్, వాటి బ్రాండింగ్ అనే అంశం మీద రైతులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విజయవాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాపాఘ్ని నదికి వర్షపునీరు



పాపాఘ్ని నదిలో ప్రవహిస్తున్న వర్షపునీరు

వేంపల్లె : మూడు రోజులుగా ఎగువన కురిసిన భారీ వర్షాలకు పాపాఘ్ని నదిలో వర్షపు నీరు వచ్చి చేరుతోంది. శనివారం ఉదయం కుమ్మరాంపల్లె వద్ద ఉన్న పాపాఘ్ని నదిలో నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పశు పోషణలో మెళకువలతో అధిక ఆదాయం



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్‌లింగారెడ్డి

వల్లూరు : పశు పోషణలో సరైన మెళకువలను పాటించడం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందడానికి అవకాశాలు వున్నాయని కడప డివిజన్ పశు సంవర్థక శాక ఇంచార్జి ఉప సంచాలకులు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి అన్నారు. చెరువుకిందపల్లెలో శనివారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఏపీ పశుసంవర్ధక శాఖ, ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువులలో ఎదకు రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎద లక్షణాలు, వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఇందులో 53 గేదెలకు చికిత్స చేశారు. 52 దూడలకు ఏలికపాముల మందు తాగించారు. కార్యక్రమంలో కమలాపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఉత్తయ్య, పశువైద్యాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొనారు.

పీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

వెందుల రూరల్ : పీఎం స్వానిధి లోక కల్యాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక మెప్మా కార్యాలయంలో పీఎం స్వానిధి లోక కల్యాణ పథక కార్యక్రమం నిర్వహించారు. పీడీ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాముడు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్‌కుమార్, సీఎంఎం నాగలక్ష్మి, సీఓ రామాంజనేయులు పాల్గొని పీఎం స్వానిధి లోక కల్యాణ పథకం ద్వారా చేకూరే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, ఆర్పీలు, మహిళలు, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు, ఆకు కూరలతో ఆరోగ్యం

సింహాద్రిపురం : సేంద్రీయ వ్యవసాయ పద్ధతి ద్వారా కూరగాయలు, ఆకు కూరలు పండించుకుని తినడం ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. శనివారం లోమడ గ్రామంలో భూమిలేని నిరుపేద ఎస్సీ వ్యవసాయ కూలీలకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆకు కూరలు, కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కడపకు చెందిన శ్రీబిందు హాస్పిటల్, తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పిడుగు పాటుకు గురైన భవనం



పిడుగు పడి దెబ్బతిన్న భవనం పైభాగం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో శనివారం ఓ భవనం పిడుగుపాటుకు గురై పాక్షికంగా దెబ్బతింది. పట్టణంలో అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఎత్తపువారికాలనీలోని ఓ భవనంపై పిడుగు పడింది. దీంతో ప్రజలు బెంబెలెత్తారు. పట్టణంలో ఇప్పటికే రెండు భవనాలపై పిడుగులు పడ్డాయి.

పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటాలి



పులివెందులలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్



కమలాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటుతున్న చైర్మన్, కమిషనర్



వల్లూరులో మొక్కలు నాటుతున్న డీడీవో మైథిలి

పులివెందుల టౌన్ : పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ తెలిపారు. శనివారం పట్టణంలో డ్వామా కార్యాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక లయోలా డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపల్ జోజిరెడ్డి ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. వైస్ ప్రిన్సిపాల్ వనచిన్నప్ప, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దనూరులో

ముద్దనూరు : స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎంపీడీవో రాధాకృష్ణాదేవి మొక్కలను నాటారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పరిశుభ్రత, పర్యావరణంపై ఆమె సమావేశం నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, మేజర్ పంచాయతీ ఈవో లక్ష్మీనరసింహులు, ఉపాధి ఏపీఎం గంగయ్య, ఏపీవో అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ చైర్మన్ మార్పురి మేరి, కమిషనర్ ప్రహ్లాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వేదాస్ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద డిగ్రీ నూతన కళాశాల భవన ఆవరణలో స్వచ్ఛ్ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలను నాటి నీరు పోశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

లింగాలలో

లింగాల : పులివెందుల సబ్ డీఎల్‌సీఓ కమల, సింగిల్ విండో కార్యాలయ సీఈవో వినోద్, డీఎల్‌సీఓ ప్రొద్దుటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సత్యానందంలు సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : గ్రామాల్లో పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం వుందని కడప డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి మైథిలి అన్నారు. శనివారం ఆమె స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి మొక్కలను నాటారు. ఎంపీడీవో రఘురామ్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, ఉపాధి హామీ పథక ఏపీఎం సుధారాణి, పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని పులివెందుల డీఎల్‌డీఓ విజయలక్ష్మి కోరారు. శనివారం గురిజాల గ్రామ సమీపంలోని గురుకుంట్ల ఆలయాల వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసుల రెడ్డి, ఏపీఓ జయభారతి, ఈసీ శ్రీనివాసరెడ్డి, టీసీ రజిత, ఎఫ్ఏ భవాని, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.